క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కోరుట్లరూరల్: ప్రభుత్వం సన్నరకపు ధాన్యానికి ఇస్తున్న రూ.500 బోనస్‌తో రైతులకు ఒక ఎకరానికి రూ. 15 వేలు లబ్ధి చేకూరుతుందని కోరుట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి అన్నారు. మండలంలోని అయిలాపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్ర పటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతకుంట సాయిరెడ్డి, కాంగ్రెస్ గామ శాఖ అధ్యక్షుడు సుధీర్,కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సన్నరకాలకు బోనస్ అందజేత


స్వీట్లు పంపిణీ చేస్తున్న రైతులు

జగిత్యాలరూరల్: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తోందని ఏపీఎం గంగాధర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామంలో ఐకేపీ కేంద్రంలో సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులు తమ ఖాతాల్లో బోనస్ పడటంతో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు వెల్దుర్తిలో 928 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులు దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధరతో పాటు, బోనస్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో రమ్య, సీసీ మరియ, వీవోఏ జల, రైతులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ సందర్శించిన విద్యార్థులు


కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో విద్యార్థులు

వెల్గటూర్ : కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీని ఎండపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ వారి ఆధ్వర్యంలో సిమెంట్ ఫ్యాక్టరీ సందర్శించి సిమెంట్ తయారీ గురించి తెలుసుకున్నారు. సిమెంట్ తయారీకి కావలసిన రామెటీరియల్స్ గురించి జనరల్ మేనేజర్ సుతారి, ఇంజనీర్ వేణుగోపాలచారిల ఆధ్వర్యంలో విధ్యార్థులకు ముందుగా డెమో క్లాస్ నిర్వహించిన అనంతరం యంత్రాలను పరిచయం చేసి వాటి పనితీరుని వివరించారు. కార్యక్రమంలో బీఐఎస్ సభ్యులు అభిసాయి, పూజాసింగ్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొలస్త్రేశ్వరస్వామి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి దంపతులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పొలస్త్రేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలతో పాటు, స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు. అనంతరం మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం అయ్యప్ప దీక్షపరులకు, భక్తులకు అన్నదానం చేశారు.

జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోని శ్రీ లలితమాత ఆలయంలో శుక్రవారం మహిళలు కుంకుమార్చనతో పాటు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలిత సహస్త్ర నామ పారాయణం చేశారు. అనంతరం అమ్మవారికి మహిళలు ఓడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ చెల్లం స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

కొనోకార్పస్ చెట్లను తొలగించాలి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని దరూర్ క్యాంప్, బైపాస్‌రోడ్, కృష్ణానగర్, ధర్మపురి రోడ్‌లో నాటిన కొనోకార్పస్ చెట్లను తొలగించాలని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


కేజీబీవీలో తనిఖీ చేస్తున్న జగిత్యాల కమిషనర్


మెట్‌పల్లిలో కమిషనర్ మోహన్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కోరుట్ల కమిషనర్ తిరుపతి

జగిత్యాల: విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ చిరంజీవి అన్నారు. శుక్రవారం వాణినగర్‌లో గల కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం 22, 7 వార్డుల్లో పర్యటించారు. శానిటేషన్ పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వదని సూచించారు. ఆయన వెంట శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూరు శివారులో కేజీబీవీని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనశాల, వంట సరుకులు, టాయిలెట్లు పరిశీలించారు. రికార్డులు చూశారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కమిషనర్ మోహన్ సూచించారు. పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గది, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. జ్వరాలు వ్యాపిస్తున్నందునా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి, దోమల బెడద లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డీఈ నాగేశ్వర్‌రావు, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు తదితరులున్నారు. అంతకు ముందు జాతీయ రహదారి డివైడర్లపై మొక్కలను పరిశీలించారు.

ధర్మపురి: వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ కృష్ణ చైతన్య, మన్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌లు తెలిపారు. ధర్మపురిలోని ఎస్సీ, బీసీ రెసిడెన్సియల్ వసతి గృహాన్ని శుక్రవారం అకస్మికంగా సందర్శించారు. భోజన సామగ్రిని, సరుకులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను శుక్రవారం తహసీల్దార్ ఖయ్యూం ఆకస్మికంగా తనిఖీచేశారు. చలికాలంలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలున్నాయా లేవా అని ఆరా తీశారు.

మోడల్ స్కూల్ సందర్శించిన డీఆర్‌డీవో

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌ను డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి రఘువరన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. 9,10వ తరగతి విద్యార్థులను కలిసి ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తున్నారు. సిలబస్ ఎక్కడి వరకు వచ్చింది, మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉంటుందా, అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలపరిషత్‌లో సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్‌లో నమోదును పరిశీలించారు. తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు డాటా ఎంట్రీ ఆపరేటర్ల పక్కనే కూర్చుండి నమోదు చేయించాలని ఎంపీడీవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఏపీవో కొమురయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మరమ్మతులకు కృషి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం తహసీల్దార్ ప్రసాద్ అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పై అంతస్తులో బాత్‌రూంలు సరిగ్గా లేక మురికి నీరు బయటకు వెళ్లకుండా ఉండటం వలన ఇబ్బంది పడుతున్నామని ప్రత్యేకాధికారి రజిత తహసీల్దార్ దృష్టి కి తీసుకొచ్చారు. సెప్టిక్ ట్యాంక్ నిండిపోయి పైప్‌లైన్‌లు చెడిపోయాయని తెలుపడంతో మరమ్మతులు చేపట్టేందుకు పై అధికారులకు విన్నవిస్తానని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు కలిసి సహపంక్తి భోజనాన్ని చేశారు.

పెగడపల్లి: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.. మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని అందించాలని భోజనం వండే పాత్రలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎస్‌వో మీనాక్షి, ఆర్ఐ శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జగిత్యాల: సికింద్రాబాద్ లాలాగూడ రైల్వేస్కూల్‌లో జరుగనున్న ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జగిత్యాల క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా నుంచి 38-40 వెయిట్ కేటగిరిలో దుగ్యాల రాఘవ్‌రావు, 42-44 వెట్ కేటరిగిలో పాదం హర్షిత్‌పటేల్, 48-50 కేటగిరిలో గౌతమ్‌తేజలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జగిత్యాల బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పాదం మహేందర్ కోచ్‌గా వ్యవహరించనున్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

జగిత్యాల: జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి సంజన చొప్పదండిలో జరుగుతున్న ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి అండర్ నెట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సంజన ఈనెల 23 నుంచి 25 వరకు మహబూబాబాద్‌లో జరిగే నెట్‌బాల్ పోటీల్లో పాల్గొననుంది.

మల్లాపూర్: అండర్-12 రాష్ట్రస్థాయి రన్నింగ్, జావెలిన్ త్రో విభాగ పోటీలకు చిట్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చవిడికారి గణేష్, బోదాసు హరీశ్ ఎంపికైనట్లు హెచ్ఎం పిన్నంశెట్టి శ్రీనివాస్ తెలిపారు.శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు గోవిందారం విద్యార్థులు

మేడిపల్లి: నవంబర్ 23,24వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఉమ్మడి మేడిపల్లి మండలం గోవిందారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నవదీప్, రిస్వంత్, రాం చరణ్, నగేశ్ ఎంపిక అయినట్లు హెచ్ఎం హుస్సేన్ తెలిపారు. మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం పేర్కొన్నారు.

● దృశ్య శ్రవణ బోధనతో సులభంగా అవగాహన

కోరుట్ల రూరల్/బుగ్గారం: దృశ్య శ్రవణ బోధన ద్వారా విద్యార్థులు పాఠాలను సులభంగా అవగాహన చేసుకుంటారని నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ దిలీప్ చంద్ర అన్నారు. మండలంలోని కల్లూరు శివారులోని కస్తూర్బాగాంధీ ఉన్నత పాఠశాలను బుగ్గారం ఉన్నతపాఠశాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిజిటల్ తరగతి గదులు, తాగునీరు, ఫర్నీచర్ పరిశీలించారు. పాఠశాలలో మెరుగు పరచాల్సిన మౌలిక వసతులను ఆరా తీశారు. బుగ్గారం పాఠశాలలోని తరగతి గదులు, తాగునీటి వసతులు, మూడు డిజిటల్ తరగతి గదులలో ఏర్పాటు చేసిన ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులను పరిశీలించారు.కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కే. సుమలత, సీఆర్‌పీలు గంగాధర్,పురుషోతం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తీవ్ర జ్వరంతో బాలుడు మృతి

మేడిపల్లి: తీవ్రజ్వరంతో బాధపడుతూ బాలుడు మృతి చెందిన ఘటన భీమారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ముంజ రిషి(13) కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

● పద్మశాలీ సంఘ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్

కోరుట్ల: తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కోరుట్ల పట్టణానికి చెందిన రుద్ర శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్ శుక్రవారం రుద్ర శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేశారు.

● ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

మేడిపల్లి: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క సతీష్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చెప్యాల రాజేష్, గౌరవాధ్యక్షుడిగా ధోనిపాల శంకర్, అధికార ప్రతినిధిగా చిట్యాల రాజేందర్, ఉపాధ్యక్షుడిగా పోడేటి సామ్యూల్, ప్రధాన కార్యదర్శిగా మకిలి సురేశ్, సంయుక్త కార్యదర్శిగా దుమ్మ శ్రీనివాస్, ఎంఎస్పీ మండల ఇన్‌చార్జిగా అంతడుపుల విజయ్ కుమార్, 10మంది సభ్యులతో కమిటీని ఎన్నుకుని నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమల గంగారాం మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్ మాదిగ, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బంగారు దీపక్, పాలెపు రమేశ్, మకిలీ ఆనంద్, ధోని పాల రాకేశ్, ఈదుల ప్రణయ్, పాలెపు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

● కరాటే కార్యవర్గం..

జగిత్యాల: తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ ఆదేశాల మేరకు కరాటే అసోసియేన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా లింగయ్య, అధ్యక్షుడిగా మొగిలి, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ మోయిస్, ప్రవీన్ కుమార్, కోశాధికారిగా అరుముల్ల రమేశ్, అడ్వైజర్‌గా హరీశ్, కార్యనిర్వహణాధికారిగా నవీన్, వికాస్‌రావు, నరేశ్ ఎన్నికయ్యారు.

● మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

కథలాపూర్: మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్సీ కవితను మండలానికి చెందిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కలిశారు. మాజీ సీఎం కేసీఆర్ ఉంటున్న ఫాంహౌస్‌కు నాయకులు వెళ్లి ఈ ప్రాంతంలోని బీఆర్ఎస్ పార్టీ గురించి చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు నాగం భూమయ్య, నాగేశ్వర్‌రావు, బద్దం మహేందర్, లోక విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● పోలీసుల సహకారంతో అంత్యక్రియలు

వెల్గటూర్ : అంత్యక్రియలు నిర్వహించే ఆర్థిక స్థోమత లేని వలస జీవి మృతదేహానికి వెల్గటూర్ పోలీసులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని స్తంభంపల్లిలో మూలికలు అమ్ముకుంటూ జీవిస్తున్న నాగపూర్ నుంచి వచ్చిన వలస జీవి కమల్‌సింగ్ చితోడియా (55) శుక్రవారం ఉదయం ఆస్తమాతో మృతిచెందాడు. మృతుడికి అంత్యక్రియలు చేసే ఆర్థిక స్థోమత లేని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

● మల్యాలలో వందశాతం సర్వే పూర్తి

మల్యాల: మండలంలోని 19 గ్రామాల్లో నూరు శాతం సామాజిక, రాజకీయ, ఉపాధి, కుల గణన సర్వే పూర్తయిందని మల్యాల మండల పరిషత్ అధికారి స్వాతి తెలిపారు. మండలంలో 17,061 ఇళ్లు ఉన్నట్లుగా ఇంటింటి సర్వేలో గుర్తించి, ఆ మేరకు శుక్రవారం నాటికి 17,061 ఇళ్లలో సర్వే పూర్తిచేశామని ఎంపీడీవో తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడికి గల్ఫ్ గాయం పుస్తకం అందజేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, టీపీసీసీ ఎన్ఆర్ఐసెల్ కన్వీనర్ చాంద్‌పాషా ఆటో బయోగ్రఫీ గల్ఫ్ గాయం పుస్తకాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌కు అందజేశారు.

జేఎల్ సాధించిన సరిత


సరిత

కోరుట్ల: పట్టణానికి చెందిన చౌడారపు హరి వరప్రసాద్-సరిత దంపతుల కూతురు సరిత జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించింది. గురువారం విడుదల చేసిన ఫలితాల్లో సరిత రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంకు, మల్టీ జోన్ వన్‌లో 15వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా సరితను పలువురు అభినందించారు.

కథలాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నారాయణరెడ్డి


నారాయణరెడ్డి


పులి శిరీషా

కథలాపూర్: కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కథలాపూర్ గ్రామానికి చెందిన పూండ్ర నారాయణరెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్‌గా పోతారం గ్రామానికి చెందిన పులి శిరీషా, డైరెక్టర్లుగా కారపు గంగాధర్ (పెగ్గెర్ల), ఎం.డీ హఫీజ్(సిరికొండ), మండలోజు నరేశ్, అల్లకొండ విజయ్, జవ్వాజి చౌదరి, ఆకుల శంకర్, లకావత్ రమేశ్, చీటి జగన్‌రావు, పిడుగు జలపతిరెడ్డి, వాకిటి రాజారెడ్డి, కందరి జీవన్‌రెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కొత్త పాలకవర్గసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మేడిపల్లి చైర్మన్‌గా మాదం వినోద్


వినోద్

మేడిపల్లి: మేడిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పోరుమల్ల గ్రామానికి చెందిన మాదం వినోద్ నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్‌గా మిట్టపల్లి రాజిరెడ్డి, డైరెక్టర్లుగా అయిత మోహన్, ముస్కెం జలందర్, పల్లి బీమన్న, బైగం రాజేశ్, దాసరి గణేష్, మాలోతు హనుమంతు, మూబిన్ పాష, మామిడి రమ, ఏలేటి మహేశ్, సురకంటి రాజిరెడ్డి లను నియమించారు.

ఘనంగా దుర్గమ్మకు బోనాలు

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామంలో దుర్గాదేవి ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామస్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకవెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు, సభ్యులు, అన్ని కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

ఇబ్రహీంపట్నం: హిందూ ధర్మాన్ని కాపాడాలని గురువర్యులు చంద్రమౌళీశ్వర స్వామి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మహా రుద్రహోమం నిర్వహించారు. 108 జంటలతో ప్రత్యేక పూజలతో రుద్రహోమపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం ప్రజలు పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.



కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ రోడ్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్ వాల్వు శుక్రవారం లీక్ కావటంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. అధికారులు పైప్ లైన్ వాల్వుకు మరమ్మతులు చేపట్టి నీళ్లు వృథా పోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
బట్టు తిరుపతి, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల, సెల్ నం.: 8919654618

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


అవగాహన కల్పిస్తున్న సారథి కళాకారులు

మల్లాపూర్: ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. ప్రజాపాలన దినోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ప్రజల కోసం నిరంతరంగా పనిచేస్తుంటే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం కొత్త దాంరాజుపల్లి, మొగిలిపేట గ్రామాల్లోనూ కళాయాత్ర ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగదీష్, కాంగ్రెస్ నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం పరుశురాంగౌడ్, మహిపాల్, రాజేందర్, కారం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

మెట్‌పల్లి రూరల్: ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్, చౌలమద్ది, ఏఎస్ఆర్ తండా, రేగుంట గ్రామాల్లో ఆమె పర్యాటించి ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో ధాన్యం నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో జాప్యం జరగవద్దని, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

● బస్సు సర్వీసులు ప్రారంభం

మేడిపల్లి: భీమారం మండలంలోని రాజలింగంపేట గ్రామానికి బస్సు గత కొన్ని రోజులుగా రావడం లేదని, కోరుట్ల, జగిత్యాల వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకుపోగా, డిపో అధికారులతో మాట్లాడి శుక్రవారం బస్సు సర్వీసులను పునఃప్రారంభించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

● ఆర్థికసాయం అందజేత

కోరుట్ల: పట్టణానికి చెందిన వీరమల్ల ప్రసాద్ కుటుంబానికి మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు రూ. 20 వేల ఆర్థిక సాయం శుక్రవారం అందించారు. ప్రసాద్‌కు ఆర్యన్ కృష్ణా, అరుణ్య అనే 18 నెలల కవల పిల్లలున్నారు. వారిద్దరూ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సామాజిక మాధ్యమం ద్వారా తెలుసుకున్న రాంబాబు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్య నాయకులు పాల్గొన్నారు.

● ఇసుక లారీ పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద కథలాపూర్ మండలం నుంచి అక్రమంగా నిజామాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత డిపో వద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు తనిఖీలు జరుపుతుండగా..అటు వైపు ఇసుక లారీ వచ్చింది. దానికి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ యాజమాని రజినీకాంత్‌రెడ్డి, డ్రైవర్ భూమయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

● రైతులకు ఈపాస్ ద్వారానే ఎరువులు అమ్మాలి

మేడిపల్లి: రైతులకు ఈపాస్ ద్వారానే ఎరువులు అమ్మాలని మండల వ్యవసాయ అధికారి షాహిద్ అలీ డీలర్లకు సూచించారు. భీమారం మండంలోని కమ్మర్‌పేట మరియు గోవిందారం గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలని, రైతులు విత్తనాలు కొనేటప్పుడు విధిగా రశీదు తీసుకోవాలని, పంట కాలం పూర్తి అయ్యేవరకు రశీదులను భద్రపరుచుకోవాలని రైతులకు సూచించారు.

● విద్యార్థినులకు అభినందన

జగిత్యాల: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయాల్లో జరుగుతున్న పోటీల్లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు అత్యంత ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో ప్రసన్న ద్వితీయ బహుమతి, స్వాతి తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అలియా మక్సూద్ వారిని అభినందించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, తిరుపతి, గంగ భవాని, సునీత పాల్గొన్నారు.

● ఎస్సెస్సీ స్పాట్ బిల్లులు చెల్లించాలి

జగిత్యాల: ఎస్సెస్సీ స్పాట్‌బిల్లులు వెంటనే చెల్లించాలని, లేనిచో 2024-25 ఎసెస్సీ స్పాట్‌ను బహిష్కరిస్తామని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర నాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24 కు సంబంధించిన స్పాట్ బిల్లులు ఇప్పటి వరకు రాలేదని, రాష్ట్ర నాయకులు చొరవ చూపి ఇప్పించేలా చూడాలన్నారు. వచ్చే ఎసెస్సీ స్పాట్‌ను బహిష్కరిస్తామన్నారు. విద్యాశాఖ అధికారులు రెమ్యునేషన్ చెల్లించడంలో మాత్రం చొరవ చూపడం లేదన్నారు. స్కూల్ అసిస్టెంట్లు తెలుగు, హిందీ పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు.

● భగవాన్ బీర్సా ముండా జయంతి

ఇబ్రహీంపట్నం: మండలంలోని కొమటికొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం గిరిజన స్వాతంత్ర సమరయోధులు భగవన్ బీర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 12 రోజులు పాఠశాలలో జాం జాతీయ గౌరవ్ పక్వడా పేరిట నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా గిరిజన సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు గిరిజన నృతాలు చేయడంతో అందరిని అకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మల్లాపూర్: ఎస్సెస్సీ పరీక్షల్లో కస్తూర్బా విద్యాలయ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ తనిఖీలో తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో జగదీశ్, ఆర్ఐ సురేశ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.